క్లుప్తంగా

తల్లి పాలపై అవగాహన

ఒంగోలు అర్బన్: ప్రపంచ బ్రెస్ట్ ఫీడింగ్ (తల్లి పాలు) వారోత్సవాల నేపథ్యంలో మంగళవారం క్విస్ కాలేజీ ఆఫ్ ఫార్మసీ ఆధ్వర్యంలో రిమ్స్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. తల్లిపాలు నవజాత శిశువుకు చేసే మేలు, పాలు ఏ విధంగా బిడ్డకు తాగించాలనే అంశాలపై తల్లులకు అవగాహన కల్పించారు. దీంతో పాటు అప్పుడే పుట్టిన బిడ్డ నుంచి ఎదిగే వరకు వయసు ఆధారంగా ప్రభుత్వం నిర్దేశించిన వ్యాధి నిరోధక టీకాలపై అవగాహన కల్పించారు. దీనిలో క్విస్ కాలేజీ ప్రిన్సిపాల్, గాయత్రి, విజయ్‌భాస్కర్‌రెడ్డి, కావ్య పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ఒంగోలు సబర్బన్: నగరంలోని హౌసింగ్ బోర్డు ఏరియాలో బుధవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఒంగోలు పట్టణ ఏపీసీపీడీసీఎల్ డీఈఈ వినయ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆయా ప్రాంతాల్లో విద్యుత్ లైన్ల కింద, పైన చెట్లు నరికివేసే కార్యక్రమంతో పాటు 11 కేవీ సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా సరఫరాకు ఉదయం 7.30 గంటల నుంచి మధ్యాహ్నం 11.30 గంటల వరకు అంతరాయం ఏర్పడుతుందన్నారు.

హ్యూమన్ రైట్స్ రాష్ట్ర వైస్ చైర్‌పర్సన్‌గా అనూష


దగ్గుమాటి అనూష

ఒంగోలు: హ్యూమన్ రైట్స్ మహిళా విభాగం రాష్ట్ర వైస్ చైర్‌పర్సన్‌గా దగ్గుమాటి అనూషను నియమిస్తూ జాతీయ చైర్మన్ ప్రసన్నకుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈమె ఒంగోలు వాసి. తనకు పదవి రావడానికి సహకరించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు ప్రకటిస్తూ తనపై ఉంచిన నమ్మకాన్ని పెంచుకుంటూ సమాజంలో మానవ హక్కులపై ప్రజలకు చైతన్యం కలిగించేందుకు కృషి చేస్తానని చెప్పారు.

విద్యుత్ ఉద్యోగుల నిరసన ర్యాలీ


ర్యాలీ చేస్తున్న విద్యుత్ శాఖ ఉద్యోగులు

ఒంగోలు సబర్బన్: విద్యుత్ ఉద్యోగులు తమ న్యాయమైన కోర్కెల సాధన కోసం మంగళవారం ఒంగోలు నగరంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పవర్ ఎంప్లాయీస్ జాయింట్ యాక్షన్ కమిటీ పిలుపు మేరకు ర్యాలీ నిర్వహించి చర్చి సెంటర్‌లో మానవహారంగా ఏర్పడ్డారు. ర్యాలీ స్థానిక కర్నూల్ రోడ్డులోని 132 కేవీ సబ్‌స్టేషన్ నుంచి రామ్‌నగర్‌లోని విద్యుత్ భవన్ వరకు సాగింది. విద్యుత్ ఉద్యోగులు, అధికారులు, కాంట్రాక్ట్ ఉద్యోగులు సంయుక్తంగా ర్యాలీలో పాల్గొన్నారు. విద్యుత్ శాఖలో దీర్ఘకాలికంగా పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులర్ చేయాలన్న డిమాండ్‌తో పాటు ఆరు ప్రధాన డిమాండ్లతో నిరసన వ్యక్తం చేశారు. జేఏసీ చైర్మన్ ఎం.వెంకటేశ్వరరెడ్డి, కార్యదర్శి కేవీపీ రంగారావు, కో చైర్మన్ కేవై రమేష్, వైస్ చైర్మన్ ఎస్.ఆనందరావు, పి.చంద్రశేఖర్, ఆర్.సంజీవరావు పాల్గొన్నారు.

గర్భిణులు ఆరోగ్యంపై దృష్టి సారించాలి

ముండ్లమూరు: మహిళలు గర్భం దాల్చిన నుంచి ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ అన్నారు. మండలంలోని మారెళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ఆరోగ్య సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో గర్భిణులకు అందాల్సిన వైద్యసేవలను క్రమం తప్పకుండా అందించాలన్నారు. ఎప్పటికప్పుడు హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించి అప్రమత్తం చేయాలన్నారు. బలవర్థకమైన ఆహారం తీసుకునే వారికి అవగాహన కల్పించాలన్నారు. సీహెచ్‌ఓ వెంకట్రావు, హెచ్ఈ అప్పలరాజు, సూపర్‌వైజర్ నాగేశ్వరరావు, సిబ్బంది ఎస్‌కెఎంఎం సుభాని, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

లోకేష్ పగటి కలలు కంటున్నాడు


మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు


సంక్షేమ పథకాల బ్రోచర్ అందిస్తున్న ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు, మేయర్ గంగాడ సుజాత

- వచ్చే ఎన్నికల్లో గెలిచేది వైఎస్సార్ సీపీనే
- మళ్లీ సీఎం అయ్యేది వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డే
- పేర్నమిట్ట గడప గడపలో పాల్గొన్న ఎమ్మెల్యే టీజేఆర్, మేయర్ గంగాడ

చీమకుర్తి: టీడీపీ అధికారంలోకి వచ్చినట్లు లోకేష్ అప్పుడే పగటి కలలు కంటున్నాడు. అధికారంలోకి వస్తే వాడి సంగతి తేలుస్తా... వీడి అంతు చూస్తానంటూ లేనిపోని ప్రగల్భాలు పలుకుతున్నాడని ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు విమర్శించారు. మంగళవారం పేర్నమిట్టలోని 41వ డివిజన్‌లో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యేతో పాటు ఒంగోలు కార్పొరేషన్ మేయర్ గంగాడ సుజాత ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మీడియాతో ఎమ్మెల్యే మాట్లాడుతూ యువగళం పాదయాత్రలో లోకేష్ ఇటీవల జిల్లాలో పర్యటించినప్పుడు చేసిన ప్రసంగాలను దృష్టిలో ఉంచుకొని 2014 నుంచి 2019 వరకు టీడీపీ అధికారంలో ఉంది కదా...? ఎంత మాత్రం రాష్ట్రాన్ని అభివృద్ధి చేశారో.. జన్మభూమి కమిటీలతో పచ్చపార్టీల నాయకులు, కార్యకర్తలు చేసిన నిర్వాకం ఏంటో అందరూ చూశారని ఎద్దేవా చేశారు. 2024 ఎన్నికల్లో మళ్లీ అధికారంలోకి వచ్చేది వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీనేనని, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి అవుతారని విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. తొలుత 41వ డివిజన్‌లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యేతో పాటు ఒంగోలు మేయర్ గంగాడ సుజాత, కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఇంటింటికీ తిరిగి సంక్షేమ పథకాలు పొందిన లబ్ధిదారులను కలిసి ఎవరెవరికి ఏఏ పథకాలు అందాయో అడిగి తెలుసుకున్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందించిన పథకాల వలన పేదల జీవితాల్లో వచ్చిన మార్పులు, వారు ఆర్థికంగా నిలదొక్కుకున్న విధానాలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. పాత అంబేడ్కర్ నగర్ కాలనీ, ఎన్టీఆర్ నగర్‌లలోని పలు ప్రాంతాల్లో ఇంటింటికీ తిరిగి సంక్షేమ పథకాలకు సంబంధించిన బ్రోచర్‌లను అందించారు. పశువుల ఆస్పత్రి సమీపంలో రూ.29.90 లక్షలతో నిర్మించిన సిమెంట్ రోడ్డును ప్రారంభించారు. అంబేడ్కర్ స్మృతివనం సమీపంలో రూ.41 లక్షలతో కమ్యూనిటీ హాలు, కల్యాణ మండపానికి శంకుస్థాపన చేశారు. తొలుత వారికి స్థానిక కార్పొరేటర్ కత్తినేని వెంకట మహాలక్ష్మమ్మ, పార్టీ నాయకుడు కత్తినేని విజయ్‌భరత్‌రెడ్డి ఆధ్వర్యంలో స్థానిక పాండురంగస్వామి ఆలయంలో పూజలు చేసి ఘనంగా స్వాగతం పలికారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ దుంపా చెంచిరెడ్డి, కార్పొరేటర్లు తేళ్ల చంద్రశేఖర్, నూకతోటి మస్తానమ్మ, నూకతోటి ఈశ్వరరావు, గోలి తిరుపతిరావు, దుంపా యలమందారెడ్డి, కత్తినేని చెంచురామిరెడ్డి, కే.రమణయాదవ్, రావులపల్లి శ్రీనివాసరెడ్డి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

టీటీడీ ఆధ్వర్యంలో సత్యనారాయణ స్వామి వ్రతాలు


పూజలకు హాజరైన భక్తులు

ఒంగోలు మెట్రో: తిరుమలలో ప్రతి పౌర్ణమికి శ్రీవారికి జరిగే గరుడసేవ పర్వదినాన్ని పురస్కరించుకొని టీటీడీ ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ప్రతి పౌర్ణమికి జిల్లాలో ఒక చోట శ్రీ సత్యనారాయణస్వామి వ్రతాలు నిర్వహిస్తోంది. తిరుమల తిరుపతి దేవస్థానాలు, హిందూ ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో అధిక శ్రావణమాసం పౌర్ణమి సందర్భంగా మంగళవారం ఉదయం తొమ్మిది గంటలకు ఒంగోలులోని శ్రీరాధాకృష్ణ ఆశ్రమంలో సామూహిక శ్రీసత్యనారాయణ వ్రతాలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. వ్రతంలో పాల్గొన్న దంపతులందరికీ స్వామి పూజ వస్తువులు, స్వామి వారి ప్రతిమల రూపులు ఉచితంగా అందించారు. పూజ క్రతువులో వేద పురోహితులు నారాయణరావు పాల్గొన్న దంపతులతో మండపారాధన, నవగ్రహ, అభిషేకం, స్వామి వారి వ్రత కథలు చెప్పారు. కార్యక్రమంలో అరవై మంది దంపతులు, వంద మంది భక్తులు పాల్గొన్నారు. శ్రీరాధాకృష్ణ ఆశ్రమం స్వామి బ్రహ్మచారి వేణుమాధవ్ వ్రత మహాత్మ్యం గురించి ప్రవచనం చేశారు. ఆశ్రమం నిర్వాహకులు మండువ మహేశ్వరరావు, కృష్ణారెడ్డి పాల్గొన్నారు. పాల్గొన్న భక్తులకు తీర్థప్రసాదాలు, అన్న ప్రసాద వితరణ నిర్వహించారు. టీటీడీ ప్రోగ్రాం అసిస్టెంట్ రావినూతల రామకృష్ణ ఈ కార్యక్రమం నిర్వహించారు.

క్షయ వ్యాధిని నిర్మూలిద్దాం

- జిల్లా క్షయ వ్యాధి నివారణ అధికారి డాక్టర్ సురేష్


ఆశా కార్యకర్తలు, ఏఎన్‌ఎంలతో మాట్లాడుతున్న జిల్లా క్షయవ్యాధి నివారణ అధికారి సురేష్

మద్దిపాడు: గ్రామాల్లో క్షయ వ్యాధి నివారణకు ప్రతి ఆశ వర్కర్ కృషిచేయాలని జిల్లా క్షయ వ్యాధి నిర్మూలన అధికారి డాక్టర్ రమేష్ అన్నారు. మంగళవారం ఆశా డే సందర్భంగా మద్దిపాడు పీహెచ్‌సీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. టీబీ ముక్త్ పంచాయత్ కార్యక్రమంలో భాగంగా ప్రతి గ్రామంలో పొడిదగ్గు దగ్గుతున్న వారి నుంచి కనీసం 15 శాంపుల్స్ తీసుకోవాలన్నారు. శాంపుల్స్‌ను ల్యాబ్‌కు పంపి నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తామని, ఒకవేళ క్షయ వ్యాధి ఉన్నట్లయితే వారికి ఉచితంగా మందులు పంపిణీ చేస్తామని అన్నారు. డాక్టర్ ఆనందమోహన్ మాట్లాడుతూ కొత్తగా పెళ్లి చేసుకున్న జంటలను గుర్తించడం, కొత్తగా ఎవరైనా చిన్నారులు జన్మిస్తే ఆ ఇంటిని సందర్శించి వారి గురించి తీసుకోవాల్సిన జాగ్రత్తల పై వివరించారు. అనంతరం ఈ ఆశా యాప్‌పై ఆశ వర్కర్లకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వారి వెంట డాక్టర్ జగదీష్, సీహెచ్‌ఓ లలితమ్మ, వెంకారెడ్డి, సూపర్‌వైజర్లు బాల కోటయ్య, నాగేశ్వరరావు, విలేజ్ హెల్త్ క్లినిక్‌ల సీహెచ్‌ఓలు, ఏఎన్‌ఎంలు ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

మద్దులూరులో బీసీ హాస్టల్ ప్రారంభం


హాస్టల్‌ను ప్రారంభించిన సర్పంచ్ శైలజ

చీమకుర్తి: మద్దులూరులోని జిల్లా పరిషత్ హైస్కూలుకు అనుబంధంగా ఉన్న బీసీ బాలుర హాస్టల్‌ను మంగళవారం స్థానిక సర్పంచ్ బీ.శైలజ, మైనం అమర్‌నాథ్, ఎంపీటీసీ సుబ్బారావు ప్రారంభించారు. గతంలో ఉన్న హాస్టల్ మూతపడటంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని వారి తల్లిదండ్రులు సర్పంచ్, ఎంపీటీసీ దృష్టికి తీసుకురావడంతో జిల్లా అధికారులతో మాట్లాడి ఈ సంవత్సరం నుంచి హాస్టల్‌ను ప్రారంభించినట్లు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక హైస్కూలు హెచ్‌ఎం, వార్డెన్, గ్రామస్థులు పాల్గొన్నారు.

డీపీవో నారాయణరెడ్డికి అభినందనలు


నారాయణరెడ్డికి పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎంపీడీవో సుజాత

కొత్తపట్నం: రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ గజిటెడ్ అసోసియేషన్ అధ్యక్షుడిగా డీపీవో జీవీ నారాయణరెడ్డిని రాష్ట్రంలో ఉన్న గజిటెడ్ ఉద్యోగులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా కొత్తపట్నం మండల పంచాయతీ జ్ శాఖ అధికారులు, ఎంపీడీవో డాక్టర్ పి.సుజాత, ఈవోఆర్డీ బాలచెన్నయ్య, పంచాయతీ కార్యదర్శులు కిరణ్‌కుమార్, కె.వెంకటేశ్వరరెడ్డి, వంశీలు డీపీఓను పుష్పగుచ్ఛాలతో అభినందించారు. రాబోయే రోజుల్లో ఇటువంటి గొప్ప పదవులు అలంకరించాలని కోరారు. ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

సీఎం సహాయ నిధి నుంచి రూ.10 లక్షలు మంజూరు


నయోమికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

- బాధితులకు చెక్కు అందచేసిన కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: కంభం మండలం దేవనగరం గ్రామానికి చెందిన బత్తుల నయోమి (ఏసుదాసు, మరియమ్మ దంపతుల కుమార్తె) కొన్నేళ్లుగా సిస్టమేటిక్ లూప్స్ ఎరిత్రోనిక్ అనే వ్యాధితో బాధపడుతోంది. గిద్దలూరు ఎమ్మెల్యే అన్నా రాంబాబు చొరవతో ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకున్నారు. దీంతో ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి చికిత్స కోసం రూ.10 లక్షలు మంజూరైంది. ఆ మేరకు మంగళవారం కలెక్టర్ దినేష్‌కుమార్ చెక్కును బాధితులకు అందజేశారు. ప్రతి నెలా రూ.15 వేలు చికిత్స కోసం తీసుకునే అవకాశం కల్పించారు.

ఒత్తిడి అధిగమించేందుకు ధ్యానం అలవరుచుకోవాలి


మాట్లాడుతున్న బీకే మంజునాథ

ఒంగోలు: యువత మానసిక ఒత్తిడిని అధిగమించేందుకు, మనస్సు వేగాన్ని నియంత్రించుకునేందుకు ధ్యానాన్ని అలవరుచుకోవాలని రాజయోగిని బ్రహ్మకుమారీస్ మంజునాథ సూచించారు. మంగళవారం స్థానిక శ్రీహర్షిణీ డిగ్రీ కాలేజీలో యువత ఆరోగ్యపరమైన క్రీడా కార్యక్రమాలు అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ధ్యానం ఎంతసేపు చేయాలి, ఎలా చేయాలనే దానిపై అవగాహన కల్పించారు. భావోద్వేగ నిరోధక శక్తి పెరిగేందుకు ఇది తోడ్పాటునిస్తుందన్నారు. సెల్‌ఫోన్ ఎక్కువగా వాడతే మెదడుపై, మానసికంగా సమస్యలు పెరుగుతాయన్నారు. వ్యసనంగా మారి సామాజికంగా కూడా చెడు ప్రభావం చూపే అవకాశం ఉందన్నారు. వ్యతిరేక ధోరణులు పెరగడం వల్ల నేటి యువత మానసిక ఒత్తిడి, ఆందోళనకు లోనవుతున్నారని, తద్వారా మానసిక బలహీనత పెరుగుతుందన్నారు. డాక్టర్ కె.సుధాకర్ మాట్లాడుతూ సంపూర్ణ ఆరోగ్యం కోసం ఆటలు ఆడాలన్నారు. యోగ , శారీరక ఆరోగ్యం చేయాలన్నారు. దీనికోసం ఆధ్యాత్మిక జ్ఞానం వినియోగించుకోవాలన్నారు. రిటైర్డ్ అదనపు ఎస్పీ సుంకర సాయిబాబు మాట్లాడుతూ మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, వాటి నుంచి విముఖంగా ఉండేందుకు ఆధ్యాత్మిక జ్ఞానం తోడ్పడుతుందన్నారు. డీఆర్‌డీఏ వరప్రసాద్ మాట్లాడుతూ యువత మారితేనే సమాజం మారుతుందన్నారు. శ్రీహర్షిణీ కాలేజీ ప్రిన్సిపాల్ దాది ఆంజనేయులు పాల్గొన్నారు.

అమ్మవారి ఆలయంలో పౌర్ణమి పూజలు

త్రిపురాంతకం: బాలాత్రిపుర సుందరీదేవి ఆలయంలో శ్రావణ పౌర్ణమి అధిక మాసం సందర్భంగా మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. త్రిపురాంతకం అమ్మవారి ఆలయానికి పెద్ద సంఖ్యలో వచ్చిన భక్తులు ప్రత్యేకంగా కుంకుమార్చనలు చేశారు. ప్రత్యేక పూజలు ఆలయ అర్చకుడు ప్రసాదశర్మ నిర్వహించారు. అనంతరం భక్తులకు ఆశీర్వచనం, ప్రసాదాలు అందజేశారు.

నగరంలో డివైడర్ల ఆధునికీకరణ


పనులు ప్రారంభిస్తున్న మేయర్ గంగాడ సుజాత

- పనులు ప్రారంభించిన మేయర్ గంగాడ సుజాత

ఒంగోలు సబర్బన్: నగరంలోని డివైడర్ల ఆధునికీకరణ పనులకు నగర మేయర్ గంగాడ సుజాత మంగళవారం పూజలు చేసి ప్రారంభించారు. ఈ మేరకు రైల్వే స్టేషన్‌కు వెళ్లే క్లా పేట రోడ్డులో పనులు ప్రారంభించిన మేయర్ మాట్లాడుతూ నగరంలోని ట్రంక్ రోడ్డు, పాత గుంటూరు రోడ్డుతో పాటు పలు డివైడర్లను ఆధునికీకరిస్తున్నామన్నారు. 15వ ఆర్థిక సంఘానికి సంబంధించిన రూ.40 లక్షల నిధులతో పనులు చేపట్టామన్నారు. కార్యక్రమంలో 11వ డివిజన్ కార్పొరేటర్ గంగవరపు ప్రవీణ్‌కుమార్, మున్సిపల్ డీఈ రఘురాంతో పాటు పలువురు పాల్గొన్నారు.

విద్యార్థులకు కెరీర్‌పై అవగాహన సదస్సు


కెరీర్‌పై అవగాహన కల్పిస్తున్న రాజశేఖర్

ఒంగోలు: ఒంగోలు సాయిబాబా సెంట్రల్ స్కూల్ 9,10 తరగతుల విద్యార్థులకు కెరీర్‌పై అవగాహన సదస్సు మంగళవారం పాఠశాలలో జరిగింది. టెక్ మహీంద్ర వైస్ ప్రెసిడెంట్ కె.రాజశేఖర్ ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థులకు అవగాహన కల్పించారు. భవిష్యత్తులో సాంకేతిక పరిజ్ఞానం ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. విద్యార్థులు భావితరాల అవసరాలకు తగ్గట్లుగా మన అభిరుచులకు అనుగుణంగా ఉన్న వృత్తులను ఎంచుకుంటే విజయాన్ని సాధించగలరన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు అడిగిన పలు ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు. విద్యార్థుల భవిష్యత్తుకు ఇటువంటి కార్యక్రమాలు మిక్కిలిగా దోహదపడతాయని పాఠశాల అకడమిక్ డైరెక్టర్ శృతి సాయినాథుని పేర్కొన్నారు. కార్యక్రమాన్ని పాఠశాల కరస్పాండెంట్ భాస్కర్, ప్రిన్సిపాల్ మహేష్ పర్యవేక్షించారు.

వేపనూనె పిచికారీతో బహుళ ప్రయోజనాలు

తాళ్లూరు(ముండ్లమూరు): రైతులు సాగు చేసిన పైరు మొలకెత్తిన 30 రోజుల వ్యవధిలో రెండు సార్లు వేపనూనె పిచికారీ చేస్తే చీడపీడలను నివారించవచ్చని వ్యవసాయాధికారి బి. ప్రసాదరావు అన్నారు. మండలంలోని బొద్దికూరపాడులో రైతులు సాగు చేసిన పొలాన్ని మంగళవారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం రైతులు వరి, మొక్కజొన్న, సజ్జ పైర్లు సాగు చేశారని, ఆయా పైర్లపై రెండు పర్యాయాలు వేపనూనె పిచికారీ చేసుకుంటే అనవసరమైన రసాయన మందులు పిచికారీ చేయాల్సిన పని లేదన్నారు. పైరు తొలిదశలో ఎకరాకు లీటరు వేపనూనెను తగిన మోతాదులో నీటిలో కలిపి పిచికారీ చేసుకుంటే మంచి ఫలితాలు ఉంటాయన్నారు. వీఏఏ అజ్మీర్, రైతులు పాల్గొన్నారు.

సీబీఏ పరీక్షల పరిశీలన

దొనకొండ: స్థానిక మండల పరిషత్ ప్రాథమిక ఉర్దూ పాఠశాలలో మంగళవారం సీబీఏ పరీక్షలను విద్యాశాఖాధికారి సాంబశివరావు సందర్శించారు. ఉపాధ్యాయులకు పలు సూచన, సలహాలు అందించారు. ఆయన వెంట ప్రధానోపాధ్యాయుడు ఆదిమూలపు ప్రభుదాసు పాల్గొన్నారు.

జగదాంబ అమ్మవారికి పూజలు


సామూహిక పూజలో పాల్గొన్న భక్తులు


గాజుల అలంకరణలో జగదాంబ అమ్మవారు

- లక్ష గాజులతో ప్రత్యేక అలంకారం

మార్కాపురం టౌన్: పట్టణంలో కొలువైన జగదాంబ సమేత మార్కండేశ్వరస్వామి దేవస్థానంలో చాంద్రమానేన శోభకృత్ నామ సంవత్సర అధిక శ్రావణమాసం శుద్ధపౌర్ణమి సందర్భంగా జగదాంబ, జ్ఞాన సరస్వతి అమ్మవార్లకు మంగళవారం మంగళ చండీ పూజను ఆలయ అర్చకులు ఘనంగా నిర్వహించారు. జగదాంబ అమ్మవారిని సుమారు లక్ష గాజులతో ప్రత్యేక అలంకరణ నిర్వహించారు. మహిళా భక్తులు సామూహిక లక్ష కుంకుమార్చనలో పాల్గొన్నారు. అర్చకుడు ఆంజనేయ స్వామి భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఏర్పాట్లను ఆలయ ఈఓ ఈదుల చెన్నకేశవరెడ్డి, చైర్మన్ వి.కేశవరావు, ధర్మకర్తలు, ఆలయ సిబ్బంది పర్యవేక్షించారు.